కథా నిలయం
5-3-27
శ్రీకాకుళం

# సామిధేని

కుశాల్‌రావును గురించి ఇటీవల పత్రికల్లో మీరు చదివేఉంటారు. భార్యకు, ముగ్గురు బిడ్డలకు, విషప్రయోగం చేసి, స్వయంగా పోలీసులకు పట్టుబడ్డాడు కుశాల్‌రావు, కానీ, పత్రికల్లో అలాలేదు. విషప్రయోగంచేసి కుశాల్‌రావు పారిపోతుంటే, పోలీసులు వెంటాడి పట్టుకొన్నట్టు, ఆయా పత్రికల స్వకీయ విలేఖరులు వార్తలు పంపారు. అసలు సంగతి నా కొక్కడికే తెలుసు. అతను పారిపోలేదు. పారిపోలేదు కూడా. అలా పారిపోవడం అతని అభిమతంగూడా కాదు.

కుశాల్‌రావును మొట్టమొదట నేను రేడియోస్టేషను దగ్గర చూశాను. అప్పటికి అతనికీ, నాకూ స్నేహంలేదు. పరిచయంగూడాలేదు. కనీసం, అతన్ని గురించి, విననన్నా లేదు. ఓ నాటకంతాలూకు రిహార్సల్స్ చూచి, బస్సుకోసం, స్టేషనుముందు నిలబడ్డాను. అవతలి వైపుగా కుశాల్‌రావు పోతున్నాడు. మాసిన పైజమా వేసుకున్నాడు. టైర్ చెప్పులు వేసుకొన్నాడు. ఎడంచేతిలో ఏవో కాయితాలున్నాయి. ఎడంగూడమీద, జానెడు మేరకు చొక్కా చినిగింది. జుట్టంతా రేగిఉంది.

మరో సమయంలో అయితే, అతన్నిగురించి ఏమన్నా ఆలోచిద్దునేమో! అప్పుడు నా కా తీరుబాటే లేదు. బస్సు రొదపెట్టుకుంటూ వచ్చింది. నా కళ్ళముందునుంచి కుశాల్‌రావు మాయమయ్యాడు.

రెండోసారి అతన్ని పబ్లిక్ గార్డెన్స్‌లో చూశాను. అదే పైజమా, అదే చొక్కా, అవేచెప్పులు. ఈసారి ఎడంచేతిలో కాయితాలు లేవు. గడ్డిమీద కూచున్నాడు చెవులోంచి పెన్సిల్ తీశాడు. దానికి ఉమ్మితడి పట్టించాడు: మోకాలిమీద కాయితం పెట్టి ఏదో రాసుకొంటున్నాడు. అతన్ని గుర్తుపట్టడానికి, నా కొట్టే టైం పట్టలేదు. చూసీ చూడంగానే, ఓహో అలనాడు, ఆకాశవాణి...' అని జ్ఞాపకంవచ్చింది.

మూడోసారి అతన్ని సినిమాహాలుముందు చూశాను. తూముమీద కూచుని 'ముంతపప్పు' తింటున్నాడు. తనలో తనేదో గొణుక్కొంటున్నాడు. తనలో తనే ఎందుకో నవ్వుకొంటున్నాడు.

"అతనెవరో తెలుసా ?" అన్నాడు అంజయ్య.

"తెలీదు" అన్నాను కుశాల్‌రావు కేసి పరిశీలనగా చూస్తూ.

"కుశాల్‌రావు" అంటూ 'పిలాటీ'ని గట్టిగా పీల్చాడు అంజయ్య.

సినిమా వదిలిపెట్టేదాకా, అతన్ని గురించి అడిగే అవకాశం నాకు దొరకలేదు. నాకేమో, ఆ పిక్చరు పరమ చెత్తాఖానీ సరుకని, అయిదు నిమిషాలకల్లా తెలిసిపోయింది. కానీ అంజయ్య ఆప్యాయంగా చూస్తున్నాడు. ఏరికోరి నన్ని పిక్చరుకు తీసుకొచ్చినందుకు, అతన్నెక్కడ డిస్టర్బ చెయ్యను ?

ఇంటి కొస్తున్నప్పుడు, అంజయ్యతో మళ్లా ఆ సంగతి కదిపాను.

"చెప్పానుగా వాడి పేరు కుశాల్‌రావ్ !"

"ఇంతకంటే అతన్ని గురించి తెలుసుకోవలసిందేమీ లేదా ?" అన్నాను.

"ఉంది" అన్నాడు అంజయ్య ఓ 'పిలాటీ' ముట్టించి. "వాడుత్త చవట. చెవలసన్యాసి. పిచ్చాడు"

"ఆ పిచ్చి లక్షణాలు నాకేమీ కనిపించడంలేదే!" అన్నాను, కుశాల్‌రావురూపం జ్ఞాపకంతెచ్చుకొంటో.

అంజయ్య ఓ క్షణం నాకేసిచూసి ఫక్కున నవ్వాడు.

'అవును. ఇంకా పూర్తిగా పిచ్చెక్కలేదు. ఇప్పుడిప్పుడే ఎక్కుతూఉంది. అంచాతే నీకా లక్షణాలు బాగా కనిపించడంలేదు. రెండేళ్ళనించీ వాడు నాకు బాగా తెలుసు. సరా ?" అంటూ అంజయ్య నా ముఖంలోకి చూశాడు.

నేను ముఖం తప్పించాను.

అంజయ్య సిగరెట్ పారేసి, జేబుగుడ్డతో ముఖం తుడుచుకొన్నాడు.

"లేకపోతే వాడు కవిత్వం రాయడమేమిటాని ?" అన్నాడు అంజయ్య నవ్వుతూ.

"ఎవడు ?"

"కుశాల్‌రావ్ !"

క్షణంసేపు దిమ్మరపోయాను. 'కుశాల్‌రావు కవిత్వం రాస్తాడా ! అయితే మరి అంజయ్య పిచ్చాడంటాడేం ?'

"అందుకనే వాడు పిచ్చాడయ్యాడు. అర్థం పర్థంలేని పిచ్చివాగుడంతా రాస్తాడు. ఇంతవరకూ ఒక్క పత్రికా, వాడి కవిత్వాన్ని అచ్చెయ్యలేదు. పథ్యానికన్నా వాడు రాసేది కవిత్వమని ఒక్కడనలేదు. కానీ, వాడి శక్తిమీద వాడికి అపారమైన విశ్వాసం ఉంది. తన కవిత్వం, లోకం చేత కీర్తింపబడేరోజు, ఎప్పుడో ఒకప్పుడొస్తుందంటాడు. ఈ ఇరవయ్యో శతాబ్దం పాఠకులకు, తనరచన అర్థంకాదంటాడు. తనురాసేది ఇరవైయొకటో శతాబ్దంవాడికట. కానీ, అప్పటికి తను పాతబడిపోయే ప్రమాదం ఉండొచ్చుట... ఇవన్నీ పిచ్చి లక్షణాలు కాకపోతే, ఇక పిచ్చికి అర్థమే లేదంటాను, ఏమంటావ్?" అన్నాడు అంజయ్య.

నేను తన అభిప్రాయాలను బలపరచాలని అంజయ్య ఉద్దేశం. ఎంచేతో నాకా పని చెయ్యబుద్ధికాలేదు.

నాలుగోసారి అతన్ని కలుసుకొన్నప్పుడు, నేనే కుశాల్ రావును పలకరించాను. అతనో సారి నాకేసి చూసి, మొదలకుండా ఊరుకున్నాడు. అతనితో మాట్లాడవలసిన సంగతులు చాలాఉన్నాయి. అత నేదోవిధంగా మాట్లాడితే, నేనూ సంభాషణను పెంచుదును. అతను మౌనంగా ఉండిపోవడంతో, నా ప్రయత్నం ఫలించలేదు.

అయిదోసారి అతన్ని నా గదిముందే కలుసుకొన్నాను.

"ఇక్కడా మీరుంటున్నారు?" అన్నాడు కుశాల్ రావు.

'ఊ' నన్నాను. అతన్ని లోపలికి తీసుకొచ్చాను. వస్తూనే, చాపమీదున్న సిగరెట్ అందుకొని ముట్టించాడు. కనీసం థ్యాంక్సన్నా చెప్పలేదు కుశాల్‌రావు... ...

అలా ప్రారంభమయింది మా పరిచయం. రోజులో ఏదో వొక టైంలో కుశాల్‌రావు నా దగ్గర కొచ్చేవాడు; సాధారణంగా రాత్రిపూట, తెల్లవార్లూ, అతనితో కబుర్లు. మీరు నమ్మరని తెలిసిగూడా చెబుతున్నాను. కుశాల్ రావుతో మాట్లాడ్డం, జీవితంలో ఓ కొత్త అనుభవం! నేను చూడని, ఎన్నో కోణాలనించి, లోకాన్ని చూశాడు కుశాల్ రావ్. కొత్తకిటికీలనుంచి ప్రపంచాన్ని అర్థంచేసుకొన్నాడు కుశాల్‌రావు.

కుశాల్‌రావు కవిత్వం రాస్తాడు. ఆసంగతి నా కొక్కడికే తెలుసు. అతని పాటలు - అవి పాటలుగూడా కావను కొంటాను-ఏపత్రికా ప్రకటించలేదు. అతనిపేరు మీ కెక్కడా కనిపించదు. అయినా, కుశాల్‌రావ్ నిస్సందేహంగా రేపటి కవి. గడ్డకట్టిపోయిన, నేటి కవితాసారాన్ని కదిలించగలిగిన వాడు కుశాల్‌రా వొక్కడేనని నానమ్మకం! అతని అముద్రిత రచనలెన్నో నా దగ్గరున్నాయి. భావి తరాలవారి కందించ డానికి, వాటిని నేను జాగ్రత్త పరిచాను. కుశాల్‌రావు కవిత్వం రాస్తాడని, ఇప్పుడప్పుడే చెప్పగల సాహసం నాకులేదు. పాతికేళ్ళకిందట చలంగార్ని వెనకేసుకురావటానికి ఎంత మందికి దమ్ములున్నయ్ ?

కుశాల్‌రావుకు, భార్యా బిడ్డలూఉన్నారు. ఆసంగతిని, అత నిలా చెబుతాడు.

"నాకో భార్యంటూ లేదు. కానీ,నా భార్యకో మొగుడున్నాడు. నాకు పిల్లలంటూ లేరు. కానీ, నా పిల్లలకో నాన్నున్నాడు."

కాస్సేపయ్యాక, కుశాల్‌రావిలా అన్నాడు.

"భార్య, పిల్లలు ... ఇదంతా ఒకపెద్ద జాతర. మగవాడికి - ముఖ్యం నాలాంటివాడికి,ఇలాంటి పగ్గాలు బొత్తిగా లాభంలేదు. వాళ్ళతో నేను రాజీపడలేను. నాతో వారు సరిపెట్టుకోలేరు."

కుశాల్‌రావు మాటలు ఒక్కోసారి చిత్రంగా ఉంటాయి.

"మొదట్నించీ నే నిలా మొండికెత్తలేదు. లోకంతో రాజీపడటానికే చూశాను. నేను లొంగినకొద్దీ అది నన్ను తన్నడం సాగించింది. ఈ పెళ్లాంకోసం,అది కన్న పిల్లలకోసం, ఆ తన్నులన్నీ ఓపికతో భరించాను. ఇంకా గట్టి తన్నులు తినమనీ,ఇంకా డబ్బు పీక్కురమ్మనీ, వాళ్ళగోల. 'ఊః పట్టరా నా కొడకా!' అంటూ లోకం, లాగిలాగి, ఊపిఊపి, తన్నడం మొదలెట్టింది. ఓపిక చచ్చింది. ఇక భరించలేకపోయాను. ఒక్కసారి లేచి నించున్నాను. నా సర్వశక్తుల్నీ కూడదీసుకొని, పరిసరాలమీద ప్రచండంగా తిరగబడ్డాను" అన్నాడు కుశాల్‌రావు.

అలా అంటున్నపుడు, అతనికళ్ళు, తాగినవాడికళ్ళలా ఎర్రనయ్యాయి. ముఖం కందగడ్డలా, కోపంతో గండరించింది. పెదిమ బిగించి, పిడికిళ్ళు బిగించి, గట్టిగా ఊపిరి పీల్చాడు.

"అయితేనేం——" నిట్టూరుస్తూ అన్నాడు కుశాల్ రావు. "పరిసరాలు గెలిచాయి. నేనే ఓడిపోయాను. కానీ, న్యాయం నా పక్షాన ఉన్నదని తెలుసు. గెలుపు ఖాయమని గూడా తెలుసు. తెలిసినా, అదెప్పటికోగానీ జరగదు. కొన్ని కొన్ని పనులకు - చాలాకాలం తరువాతగానీ - దశాబ్దాలూ శతాబ్దాలు జరగాలేమో-మంచి ఫలితాలు రావనుకొంటాను. అందాకా, ఈ బాధలు, ఇరుకు, చీకట్లు తప్పవనుకొంటాను."

నేనేమీ అనలేదు. కుశాల్ రావు మళ్ళీ చెప్పుకు పోతున్నాడు.

ఒక్కొక్కసారి నాకేమనిపిస్తుందంటే, ఈ సత్యం చెప్ప డం, నిజాయితీకోసం పాకులాడటం, వ్యక్తిత్వం నిలబెట్టు కోడం, ధర్మం, హేతువాదం-ఇవన్నీ అర్థంలేని పిచ్చి వాగు డేమో ననిపిస్తుంటుంది. వీటిని పట్టుకు పాకులాడే వ్యక్తికి, పరిసరాలతో రాజీపడే తెలివీ, సరిపెట్టుకు వెళ్ళగల చాతు ర్యమూ, జీవితంతో Adjust కావడమూ, చేతకాక, కుదరక, ఆ అసమర్థతను కప్పుకునేందుకు, వీటిని గొప్ప ఆదర్శాలుగా భావించి, నమ్మి, వీటికోసం బాధపడి, బ్రతుకును స్వయంగా హింసించుకోవడం జరుగుతుందేమో ననుకొంటాను. లేక పోతే, ఇదో రకమైన జబ్బన్నా కావాలి... వీళ్ళవల్ల లోకం బాగుపడటం, ప్రపంచంలోకి కొత్తదోవలు రావటం, ప్రజలు Cultural గా Advance కావటం, జీవితంలో పెద్ద మార్పులు; ఇవి సరే! కానీ, ఏ లాభమూ ఉండదని తెలిసీ, పైగా, అష్ట కష్టాలూ పడాలని తెలిసీ, తను నమ్మినదానికోసం, అలా అన్ని బాధలనూ, లోపలికి తీసుకొని, శాంతంగా ఉండగలగడంలో

ఆ వ్యక్తి జడుడన్నా కావాలి. లేదా, గొప్ప మహర్షన్నా కావాలి. ఏమంటారు ?"

"విమాన మెక్కే ప్రతివాడికీ, దాని చరిత్ర తెలీదు. తెలుసుకోవలసిన అవసరంకూడా లేదు. ఇలా తనపేరు స్మరించే దిక్కుకూడా ఉండదని, విమానం కనిపెట్టినవాడికి తెలీదేమో! తెలిసినా, 'అతను మాని ఉండడనుకొంటాను. తనను గురించి ప్రజలు చెప్పుకొంటారా, లేదా అన్న బాధ, రాజకీయ నాయకులకూ, కొందరు కవులకూ ఉండొచ్చుగానీ అటువంటివారికి ఉండదనుకొంటాను. జీసస్ సిలవ నెక్కడం కీర్తికోసమనుకోను. సోక్రటీస్ విషం తాగడం, బ్రూనో మంటల్లో కాల్చబడటం, రేపెప్పుడో ప్రజలు తమను ఆరాధిస్తారనీ, బ్రహ్మరథం పడతారనీ కాదు. తాము నమ్మిన సత్యం, ధర్మం, చాలా ప్రమాదకరమైనవని తెలిసే, వారు అందుకు సిద్ధపడ్డారు. మడ్డిగా, గుడ్డిగా, జిడ్డుగా మసిలే లోకంలో, ఎంతో కొంత కదలిక రావడానికి, అలాంటివారే కారణం. ఫలితాలు వారికి దక్కటం, దక్కకపోవటం ముఖ్య సమస్యకాదు. తమ చుట్టూఉన్న సమాజంతో పేచీపడి, బాధపడి సంఘర్షించినప్పుడే' సమాజానికి కొంత వివేకం, కదలిక కలుగుతాయి. ఈపని అందరివల్లా కాదు. కొందరే చెయ్యగలరు ... చాలాసేపు మాట్లాడానా?" అన్నాను.

"లేదు" అన్నాడు కుశాల్‌రావు చిన్నగా నవ్వుతూ.

ఆ తరవాత నా కనిపించింది అనవసరంగా ఉద్రేకపడ్డానేమోనని! కుశాల్‌రావును మామూలు మనిషిని చేదామని, నా ప్రయత్నం. కానీ, అందుకు భిన్నంగా మాట్లాడానని

పించింది. ఈ రకమైన ప్రోత్సాహం లేకనే, అతను అన్వేషిస్తున్నాడేమో! అది నా దగ్గిర దొరుకుతుంది గనక, కనీసం దొరకొచ్చుననే ఆశతోనే, నా గది కొస్తున్నాడేమో!

ఈ సంభాషణ జరిగిన రాత్రి, అతను రాసిన పంక్తుల్లో కొన్నింటిని, యథాతథంగా ఇక్కడ ఉంచుతున్నాను.

ఠాణాలో పన్నెండుగంటలు కొట్టారు.

పోలీసులు విజిల్సు వేశారు.

ఆఫీసరుగారి అందమైన బొచ్చుకుక్క, ఆయనలాగే గుర్రుపెట్టి నిద్రపోతోంది.

ఆయనకల్లో అప్సరసలు మెరుస్తున్నారు.

ఆయనభార్య, వంటవాడితో కులుకుతోంది.

లారీలమీద ధాన్యం బస్తాలు.

చల్లగా చీకట్లోకి వెళ్ళిపోతున్నాయి.

'పారడైజ్ బార్'లో త్రీడాగర్సు సీసాలు చప్పు చప్పున ఖాళీ అవుతున్నాయి.

ఆంగ్లో ఇండియన్ అమ్మాయి, పెదవులకు 'గోల్డెన్ డస్టు' పట్టిస్తోంది.

'మెహిందీ' మురికి గదుల్లో, చీకట్లో 'మెహర్‌బీబీ' బాధగా రమిస్తోంది.

లోగిట్లో 'సరసీరుహం' బిగికౌగిట్లో.

అబ్దుల్ ఖాదర్ కిసుక్కుమంటున్నాడు.

ఠాణాలో పన్నెండుగంటలు కొట్టారు.

అంతా సజావుగానే సాగుతోంది.

నోట్ల కవర్లు చేతులు మారాయి.

ఉద్యోగం ప్రామిస్ చేయబడింది.
ముఠానాయకుడు మూడువేలు అందుకొన్నాడు.
మా పేట ఓట్లన్నీ నీకే ఖాయమన్నాడు.
బెడ్ మీద పేషెంట్ 'నీళ్ళు-నీళ్లు' అంటున్నాడు.
నర్సమ్మను డాక్టర్ సాబ్ నలిపేస్తున్నాడు.
తోడేల్లా ఆకలి, పేగుల్ని తినేస్తోంటే,
నిరుద్యోగి కాళ్ళు ముడుచుకు పడున్నాడు.
కల్లుతాగి, వొళ్ళు మరిచాడు కార్మికుడు.
కడుపులో కాళ్లెట్టుగుంది వాడి భార్య.
పిల్లలు, అర్ధాకలితో అసురుసురంటున్నారు.
తల్లులు, గుండెల కొత్తుకొని చిచ్చుకొడుతున్నారు.
ఠాణాలో పన్నెండుగంటలు కొట్టారు.
అంతా సజావుగానే సాగుతోంది.
పక్కలో పసివాడు పాలకోసం తన్నుకొంటున్నాడు.
భార్యకోసం భర్తగాడు, రానిదగ్గు దగ్గుతున్నాడు.
వీధిలో ఊరకుక్కలు హడావుడి చేస్తున్నాయి.
నీడల్లో పడుచుపిల్లలు గుసగుసలాడుతున్నారు.
బొచ్చుకుక్క నిద్రలేచి, ఆవలించింది.
ఆఫీసరుగారి కల, హఠాత్తుగా ఆగిపోయింది.
ఆఫీసరిణి, తియ్యగా కళ్ళు మూసుకొంది.
లారీలు గమ్యస్థానం చేరుకొన్నాయి.
'గోల్డెన్ డస్టు' పట్టించడం పూర్తయింది,
'మెహర్ బీబీ' కుచ్చెళ్ళు దులుపుకొంది.
'సరసీరుహం' ఆవలించి వొళ్లు విరుచుకొంది.

పేషెంటు చచ్చిపోయాడు.
నర్సమ్మ, అండర్ వేర్ వేసుకొంది.
కార్మికుడు కళ్లు తెరిచాడు.
వాడిభార్య నిద్రట్లో కలవరించింది
పసివాడు కునుకుతీశాడు.
భార్య భర్తమంచంమీదికి జారింది.
బిచ్చగాడిలా బిక్కుబిక్కుమంటున్నాడు జాబిలి.
నిఖార్సయిన దరిద్రంలా మెరుస్తోంది వెన్నెల.
ఠాణాలో పన్నెండుగంటలు కొట్టారు.
అంతా సజావుగానే సాగుతోంది...

* * *

అనేకానేక కారణాలవల్ల ఇంతకన్నా ఎక్కువ పంక్తుల్ని నే నిక్కడ ఇవ్వలేకపోతున్నాను. కాలం కలసివచ్చినప్పుడు, కుశాల్రావు సంపూర్ణ సాహిత్యం, తప్పకుండా నేను పాఠకుల కిస్తాను. భావి సాహిత్య ప్రపంచం కుశాల్ రావు సాహిత్యాన్ని దాచి ఉంచినందుగ్గాను, నన్ను తప్పకుండా గౌరవిస్తుంది.

కుశాల్ రావు బాధలపట్ల, నాకు క్రమంగా సానుభూతి సన్నగిల్లిపోతోంది. అత నలా బాధపడటమే మంచి దేమో నను కొన్నాను. అన్నీ సజావుగావుంటే, అందరిలా అతని బ్రతుకూ సీదాగా గడిచిపోయేది. అలాలేదు కాబట్టే, అతన్నించి అమూల్యమైన సాహిత్యం (ఈతరంవారికికాదు) ప్రభవిస్తోంది. కనీసం అలాంటి సాహిత్యంకోసమన్నా, కుశా రావుకు, ఇంకా

బాధలు, ఇబ్బందులు, అడ్డంకులు, ఇక్కట్లు, పుంఖాను పుంఖంగా, ధారాపాతంగా రావాలని నేను కోరుతున్నాను. అందుకు, యథాశక్తి దోహదంకూడా చేశాను.

ఇది జరిగిన వారంరోజులకు, అంజయ్య హడావుడిగా, నీ దగ్గరకు పరుగెత్తుకొచ్చాడు.

"ఏమిటి విశేషం?" అన్నాను అంజయ్యతో.

"వాడిక్కడే పడుకొంటున్నాడా ?"

"ఆఁ."

నా తెలివితక్కువతనానికి చాలా విచారించాడు అంజయ్య.

"కనీసం ఇప్పణ్నించైనా మానెయ్! వాడికి మరీ బుర్ర చెడిపోయింది. పూర్తిగా పిచ్చెక్కింది.

"ఉదయం, అబిడ్ కేసి వెళ్లాను. కుశాల్‌రావు ఓ రాయిమీద నిలబడి, పిచ్చి పిచ్చిగా వాగుతున్నాడు. చొక్కా చింపుకొన్నాడు. జుట్టు పీక్కున్నాడు. మణికట్టు దగ్గర నెత్తు రోడి సేలా కొరుక్కొన్నాడు..."

గదికి తాళంవేసి కుశాల్‌రావుకోసం బయలుదేరాను. పదిమంది గుంపుకూడిన ప్రతిచోటా చూశాను. మరొకర్ని అడగడానికి భయం, జంకు. సాయంత్రందాకా వెదికినా, అతను కనుపించలేదు. ఇక శాశ్వతంగా కనిపించడేమో నని పించింది. ఆ ఊహరాగానే, నేను చలించిపోయాను.

సుఖమైనా, కష్టమైనా, మనిషి, ఒక దశదాకా మాత్రమే భరించగల డనుకొంటాను. ఆ సరిహద్దుదాటాక, అతను అదుపులో ఉండటం అసాధ్యంకావచ్చు. కుశాల్‌రావు

నించి మంచి సాహిత్యం రాబట్టటంకోసం, అత న్నింకా నేను చీకట్లోకి, ఇరుకుల్లోకి, గతుకుల్లోకి నెట్టాను. బాతు బంగారు గుడ్లు కథలా కాదు గదా!

నాంపల్లి మూలమీద, కుశాల్‌రావు గొంతు వినిపించింది. రేకెత్తిన భయం చల్లారిపోయింది. చచ్చిపోయాయను కొన్న ఆశలు, కొద్దిగా తోకలాడించాయి.

రాత్రికీ, ఇప్పటికీ కుశాల్‌రావులో పెద్ద మార్పులొచ్చాయి. ఇప్పు డతనివంటిమీద చొక్కా-గూడా లేదు. నడిరోడ్డులో నిలబడి, రెండుచేతులూ జాడిస్తో బిగ్గరగా అరుస్తున్నాడు.

"దయచేసి నామాటలు నమ్మండి. నేను అబద్ధం చెప్పడంలేదు... దయచేసి అందరూ వినండి. నేను అమ్ముడు బోవడానికి సిద్ధంగాఉన్నాను. నా చేత మీ ఇష్టమొచ్చిన చాకిరీ చేయించుకోండి. ఏ పనైనాసరే. ఏం చెయ్యమన్నా చేస్తాను. శాశ్వతంగా అమ్ముడుపోతాను. వెల స్వల్పం, ఫల మధికం, ఆలసించిన ఆశాభంగం! నన్ను కొనండి. నా పెళ్ళాన్ని కొనండి. నా పిల్లల్ని కొనండి. ఒక్క-సారి, రెండుసార్లు... కావలసిన వారు చేతులెత్తండి, మూడుసార్లు..."

కుశాల్‌రావును, చాలా ప్రయత్నంమీద నా గదికి తీసుకొచ్చాను. వస్తూనే, అతను చాపచుట్టలా పడుకొని నిద్రపోయాడు.

సాయంత్రం నే నొచ్చేసరికి, అత నేదో రాసుకుంటున్నాడు. నన్నుచూచి రాయడం ఆపాడు. చిరునవ్వు నవ్వాడు.

"ఓ స్కెచ్ రాస్తున్నాను," అన్నాడు కుశాల్‌రావు.

"దేనిమీద?"

"ఇక్కడ మనుషులు అమ్మబడుదురు" అని హెడ్డింగ్ పెట్టాను. ఎలా ఉందంటారు?"

కుశాల్‌రావు మొట్టమొదటిసారి నన్ను సలహా అడిగాడు.

"నచ్చలేదు. బానిసయుగం ఏనాడో పోయింది. ఈ రోజుల్లో..."

కుశాల్‌రావ్ బాధగా నవ్వాడు.

"అంచాతే నా రచన లెవ్వరికీ వినిపించను" అన్నాడతను విసుగ్గా. "పెళ్లాం మొగుడికి బానిస, మొగుడు పెళ్లానికి బానిస. ఇద్దరూ పిల్లలకు బానిసలు. పిల్లలు వీళ్ళకు బానిసలు. గుమాస్తా పైవాడికి బానిస. పైవాడు, ఆ పైవాడికి బానిస. ప్రధాని పార్లమెంటుకు బానిస. పార్లమెంటు ప్రజలకు బానిస. ప్రజలు ప్రభుత్వానికి బానిసలు. లేనివాడు ఉన్నవాడికి బానిస. ఉన్నవాడు పన్నులకు బానిస... ఇలా ప్రతివాడు ప్రతివాడికీ, ఎక్కడో ఓచోట, ఎప్పుడో ఓనాడు బానిసకావడం తప్పలేదు. ఇంక స్వేచ్ఛేమిటి నా బొంద! ఇదివరకు బలం ఉన్నవాడిదే బతుకు. ఇప్పుడు డబ్బున్నవాడిదే బతుకు. ఇదివరకు బలం ఉన్నవాడు, బలహీనుల్ని లొంగదీసి చాకిరీ చేయించుకొనేవాడు. ఇప్పుడు డబ్బున్నవాడు, లేనివాళ్ళచేత, తన్ని మరీ పని చేయించుకొంటున్నాడు. ఒకప్పుడు బానిసలున్నా, వాళ్ళకు ఎంతోకొంత 'తిండి' దొరికేది. ఇప్పుడు 'బానిసగా

కొనండ్రోయ్' అంటున్నా, కొని, ఇంత చాకిరీ చేయించుకొని, అణాడబ్బులిచ్చే నాథుడులేడు. ఇదివరకు, బానిసల్ని మేపేవారు, బాగా పన్లుచేయించుకోవచ్చని. ఇప్పుడాఇబ్బంది లేదు. అమ్మడు బోవడానికి లక్షలున్నారు. కొనడానికి ఒక్కడూలేడు. ఈ విషయం మీదనే నేను స్కెచ్ రాస్తున్నాను."

అతనితో నేను వాదించలేదు. కుశాల్రావు చెప్పింది నిజమే ! సరిగ్గా, ఇప్పుడు, అతనన్నట్లే జరుగుతోంది ! కానీ, దాన్ని బైటికి అనడానికి లేదు. ఒకవేళ అన్నా, ఆభాషలో అనడానికి అసలేవీల్లేదు. బానిసయుగం పోయిందనీ, మనిషి చాలా ఎదిగాడనీ, అందరూ అంటున్నారు. అలా అంటున్న వారికి, మనిషి ఎదుగుడుతో బాటు, ఆనాటి బర్బరత్వం గూడా ఎరిగిందనీ తెలీదు. తెలిసినా చెప్పడం వారి కిష్టం లేకపోవొచ్చు. దాని రూపం మారింది, పేరు మారింది, వస్తువుగుణం మాత్రం అదే; ఆ విధానాలే, పద్ధతులే, ఆ మార్గాలే! వాటికే కాస్త పాలిష్ పెట్టి, నగిషీలు చెక్కి, రంగు వేసి, కొత్తపేర్లు పెట్టుకొని, 'అబ్బో ! ఎంత ఎదిగాం' అనుకొని సంతృప్తిపడటం, స్వభావంలోనే ఉందేమో!

ఈ హంగామా, తెరలు, అల్లికలు తీసేసి, ఆనాటి అసలురూపాన్ని ఎత్తి చూపుతూ 'ఇదిగోనయ్యా ! మీరు లొట్టలేసుకొంటున్న అభివృద్ధి!' అంటే ఆ **Bitter Truth** ను భరించలేక, అమాంతంగా అలా అన్నవాణ్ని పిచ్చివాడికింద జమ కట్టడంలో, సమాజం తనను తను కాపాడుకొనే ప్రయత్నం, ఆత్మవంచన ఉన్నాయనుకొంటాను.

వీటన్నింటినీ మించి ఓ కొత్తరకం స్కెచ్ కుశాల్ రావు నించి వొస్తుందన్న ఆశతోనే, అతన్ని నేను వాదన లోకి దించలేదు. అతని ఉద్దేశాలు మనకు సమ్మతంకావా? ఇబ్బందిలేదు. కానీ, ఆ ఉద్దేశాలను వెలిబుచ్చేందుకు అతను వాడే టెక్నిక్, అలాంటి ఉద్దేశాలు కలగడానికి అతనిచుట్టూ ఉన్న పరిస్థితులు, వీటిని మనం ఎప్పుడూ కాదనలేం!

ఉదయం నేను లేచేసరికే కుశాల్‌రావు లేడు. అతను రాసిన స్కెచ్ కోసం, గదంతా గాలించాను. ఎక్కడా కని పించలేదు. అయితే, అతను రాత్రి స్కెచ్ రాసి ఉండడను కొన్నాను. ఎందుకంటే, రాసిన కాగితాలను జాగ్రతచేయ డం అతనికి బొత్తిగా తెలీదు.

ఆఫీసుకి వెళ్ళబోతున్నప్పుడు, గుండెలుబాదుకొంటూ అంజయ్య వచ్చాడు. వస్తూనే నన్ను కావిలించుకొని భోరు మని ఏడ్చాడు.

"నిన్ను మళ్ళీ చూస్తా ననుకోలేదురా! ఆ పిచ్చివెధవ వాళ్ళతోబాటు నిన్నూ చంపేశాడేమో ననుకొన్నాను. నువ్వేమయినా అనుకోరా, నా గుండెల్లో గుండెలు లేవంటే నమ్మ."

అంజయ్యను సముదాయించి,అసలు విషయమేమిటని, మెల్లగా అడిగాను.

"వాడిలాంటి అఘాయిత్యం ఏదో ఒకటి చేస్తాడని, మొదట్నుంచీ అనుకొంటూనే ఉన్నా. అనుకొన్నంతా చేశాడు" అన్నాడు అంజయ్య.

"నిండు ప్రాణాలు తియ్యటానికి వాడికి చేతు లెలా వచ్చాయో, ఆ భగవంతుడికే తెలియాలి."

అంజయ్య చెమటలు తుడుచుకొంటూ చెబుతున్నాడు.

"పెళ్ళానికీ, ముగ్గురు పిల్లలకూ, పాలల్లో విషం కలిపి పెట్టాడు. తరువాత పారిపోతుంటే, పోలీసులు వెంటబడి పట్టుకొన్నారుట. ఇప్పుడు వాడు తాలూకాలో ఉన్నాట్ట. వాడి జేబులో చిల్లర డబ్బులూ, విషం పొట్లమూ ఉన్నాయట. పోలీసులు ఆచూకీ తీస్తున్నారు. అసలు వాడికి విషంకొనే డబ్బెలా వచ్చిందో, ఎక్కడ కొన్నాడో కూపీలు తీస్తున్నారు..."

అప్రయత్నంగా నా జేబు తడివాను. పది రూపాయల నోటు కనిపించలేదు. బహుశా ఆ డబ్బుతోనే కుశాల్‌రావు విషం కొనుంటాడు. ఆ పదిరూపాయలూ అతనికి దొరక్కపోతే, అతగాడి భార్యా బిడ్డలకు ఇంత తొందరగా చావు వొచ్చేదికాదేమో! డబ్బు పోయిందనికాదు,నాడబ్బు ఇంతఘోరంగా ఉపయోగపడిందేమిటా అనేదే నా బాధ.

కుశాల్‌రావు ఆ పని చెయ్యడానికి, పరోక్షంగా నా బాధ్యతగూడా కొంత ఉంది. నేరస్థుణ్నే తప్ప, అతని పరిస్థితుల్ని అవగాహనచేసుకునేంత విపులంగా న్యాయశాస్త్రం లేకపోవడం, కుశాల్‌రావు దురదృష్టం!

మూడోరోజు ననుకొంటాను, కుశాల్‌రావు నా కిలా ఉత్తరం రాశాడు.

"—గారూ! మీకు తెలీకుండా, మీ పదిరూపాయలు దొంగిలించాను. మీ డబ్బు - పదిరూపాయలే కానివ్వండి- నాకు మహోపకారం చేశాయి. నా సమస్యను శాశ్వతంగా పరిష్కరించాయి. నా కిప్పుడు భార్యలేదు, పిల్లలు లేరు, వాళ్ళను పోషించాల్సిన బాధ్యతా లేదు. వాళ్ళు దరిద్రంతో లుకలుకలాడిపోవటంలేదు. తిండికోసం నకనకలాడిపోవడం లేదు. వాళ్ళను తలుచుకొని గుండెలు పగిలేలా దిగులుపడ వలసిన అవసరం నాకిక శాశ్వతంగా తీరిపోయింది. నే చేసిన పనిని, మీరు హర్షిస్తారనుకొంటాను. ఆట్టే శ్రమలేకుండా చనిపోయే విషం వారికిచ్చాను. స్వయంగా పోలీసులకు పట్టుపడ్డాను. ఈ సంగతి మీ కిప్పటికే తెలిసిఉండాలే!

"ఇక్కడ ఎంత బాగాఉందని! గట్టిగది, రాతిగోడలు ఇనప తలుపులు. పక్కకు గుడ్డ, కప్పుకొందుకో కంబళి, కట్టు కొందుకు గుడ్డలు. ముప్పూటలా, వేళ మించకుండా ఏదో వో తిండి, స్నాన సౌకర్యాలు, తెల్లవార్లూ దీపం! చాలా హాయిగా ఉం దిక్కడ. ఇటువంటి సౌకర్యాలకోసమే, నేను ప్రయత్నించాను. పడరాని పాట్లు పడ్డాను. అందర్నీ యాచించాను. నన్ను నేను చంపుకున్నాను. అమ్ముడుబోవడాని క్కూడా సిద్ధపడ్డాను. ఏమీ లాభంలేకపోయింది.

"అనాది యుగంలో, బలహీన ప్రాణులకు జీవించే అవకాశాలు చాలా తక్కువగా ఉండేవి. బలమైన జంతువులు, ఏదోవిధంగా, ఆ చిన్న ప్రాణులను రూపుమాపుతూ ఉండేవి. ఈ అణుయుగంలో గూడా, అదే విధానం, మరోరూపంతో మరోపేరుతో అమలులో ఉంది. బాహ్యమైన మార్పులు

తప్ప, మూలంలో మార్పు అంటూ ఏమీ జరగలేదనేది నా రూఢి విశ్వాసం. ఒకప్పుడు శారీరకమైన బలం కారణం కాగా, ఇప్పుడు ధనం కారణమవుతోంది.

"మానవ స్వభావంలో—అనాది యుగభావాలు, అలవాట్లు, ప్రేరేపణలు, ఇంకా బలంగా ఉన్నాయి. భేదమల్లా, ఇదివరకటి దోవల్లో కాక కొత్త మార్గాల్లో అవి పని చేస్తున్నాయి. ఒకప్పుడు బంగారంకోసం, రాజ్యంకోసం, ఆడదానికోసం, మతంకోసం, ప్రత్యక్షంగా యుద్ధాలు జరిగాయి. ఒకరినొకరు దారుణంగా నరుక్కుని, నెత్తురు మడుగుల్తో గతాన్నంతా నింపేశారు. ఇప్పుడు వాటికోసమే, మరో ముసుగులో, మరో పేరుతో పరోక్షంగా నరుక్కుంటున్నారు...

ఈ ఉత్తరం మీకు చేరుతుందో లేదో నాకు తెలీదు. చేరితేమాత్రం నేను సుఖంగాఉన్నానని గ్రహించండి! ఇప్పుడు నాకు తిండికోసం దిగుల్లేదు. గుడ్డకోసం, ఇంటికోసం దిగుల్లేదు. చాలా హాయిగా, ప్రశాంతంగా ఉన్నాను. ఇటువంటి జీవితమే, నేను ఇంతకాలంనించీ కోరుకుంటున్నాను. ఇందులో ఏదో వంతు సౌకర్యాలు నాకు దొరికితే, దొరుకుతాయన్న గ్యారంటీ ఉంటే, వారి కలా విషమిచ్చిఉండను. ఇప్పుడింతగా ఆదరిస్తున్నవారు, అప్పుడెందుకు నన్ను పట్టించుకోలేదో ఊహించలేకపోతున్నాను. ఏదో ఒక దుర్మార్గం చేస్తేనే గానీ మనిషి బ్రతకలేకపోవడంకన్నా అధమాధమం సిగ్గుమాలినతనం, నాకు తట్టడంలేదు. "ఎప్పుడన్నా మీతో అన్నానా, అంతిమ విజయం నాదేనని? అలాగే సాధించాను! అయితే ఆ ఫలితాలను పంచుకొందుకు, నా

వారంటూ ఎవ్వరూ లేకపోయారు. అసలు నావారనేవారు లేకుండాపోబట్టే, నేనీ విజయాన్ని సాధించడం జరిగింది. వీలుంటే - నాకోసారి కనిపించండి - కుశాల్‌రావు."

పోనీ, ఓసారి వెళ్లొద్దామా—అనుకొని కూడా మానేశాను. అతని ఉత్తరానికి - కనీసం జవాబుగూడ రాయలేదు. అతనికి తెలుసు - నేనొక్కణ్ణే అతని మిత్రుణ్ణనీ, తప్పకుండా తనను చూడడాని కొస్తాననీనూ. కానీ, ఈ రెండు పన్లూ చేసి, అతని మనశ్శాంతిని పాడుచెయ్యబుద్ధి కాలేదు.

కుశాల్‌రావును గురించి, నాకున్నదల్లా ఒక్కటే దిగులు. భార్యా బిడ్డలు చనిపోయారని, కనక వారి బాధ్యతలు తనకేమీ లేవన్న ఆలోచనే, అత నిప్పుడు అనుభవిస్తున్న సుఖానికీ, హాయికీ, మూలబీజాలు. కాని, అతనను కొంటున్నట్టుగా వారు చనిపోలేదని, ప్రస్తుతం హాస్పిటల్లో వుండి, క్రమంగా కోలుకుంటున్నారని తెలిసినపుడు కుశాల్‌రావు ఏమంటాడా అని!

# చేదు ఫలం

లోకంలో రకరకాల మూర్ఖులున్నారు. వారిలో కొందర్ని మనం భరించగలం. మరికొందర్ని బొత్తిగా భరించలేం. ఈ భరింపలేని శాఖలోకే శంకరంగూడా వస్తాడని సుందరం అభిప్రాయం. మొన్న మొన్నటిదాకా వాడు యిలాంటివాడని ఎవ్వరికీ తెలీదు. వాడిలో ఇంతటి 'సంస్కార